ఆ మాటకు ఈ జవాబు

"నాన్నా ఆఫీసు దగ్గరికి వచ్చేశాం. ఈ దరఖాస్తులో ఉన్నదే కాకుండా ఇంకా జాలి కలిగించేటట్టుగా నా పరిస్థితిని ఆమెకు నీవు చెప్పాలి" నడుస్తూ చెప్తు తోంది నళిని తండ్రికి.

అలాగే అన్నట్టు తల ఊపాడు నారాయణ.

"ఆమె చాలా మంచిది నాన్నా. అందరూ ఆమెను గురించి ఎంతో చెప్తు కుంటారు. టీచర్ల కష్టసుఖాలు బాగా ఆలోచిస్తుంది. ఆడవాళ్ల కష్టసుఖాలు ఆడ వాళ్లకే బాగా అర్థమవుతాయి నాన్నా."

"అయితే మరి- నీవు ఆరునెలల నుంచీ చేస్తున్న ప్రయత్నము విఫల మెందుకవుతోంది? నేను వచ్చి మాత్రం చక్కబెట్ట గలనా?" అంటున్నాడు నారాయణ.

మరో నాలుగడుగుల్లో ఆఫీసు వచ్చింది. ఇద్దరూ మెట్లెక్కేసరికి జవాను ఎదురుగా వరెండాలోనే కనబడ్డాడు.

"అమ్మగారున్నారా?" అడిగింది మెల్లగా నళిని.

"భోజనం చేయటానికి లోపలికి వెళ్లారు. ఓ గంట కూర్చోండి. భోజనం చేసి అమ్మగారు రెస్టు తీసుకుంటారు" అతడి పనిమీద వెళ్లిపోయాడు.

వరెండాలో నాలుగు బెంచీలున్నాయి. పదిమంది వరకూ అభ్యర్థినులు కూర్చుని ఉన్నారు. మూడుగంటల తరువాత జిల్లా విద్యాశాఖాధికారుల మీటింగు ఉన్నట్టు తెలిసింది. రెండుగంటల తరువాత- మూడుగంటల లోపల ఆమె ఈ పది మందికీ ఇంటర్వ్యూ ఇవ్వగలదా అని ఆలోచిస్తున్నాడు నారాయణ.

ఆయనకు ఆ బెంచీల మీద కూర్చున్న టీచరు అభ్యర్థినులను చూస్తుంటే జాలిగా ఉంది. వాళ్ల సమస్యలేమిటో? పెళ్లి అయితే సంసారాలు రెండవుతా

యన్న సమస్య. పెళ్లి కాకపోతే పల్లెటూళ్లల్లో ఒక్క పిల్ల ఎట్లా ఉంటుందన్న సమస్య. అందరికీ నగరాలు కావాలని కోరిక. మరి పల్లెటూళ్లల్లో స్కూలు టీచర్లు పనిచేయకపోతే ఎట్లా? ఆడపిల్లలకే ఈ సమస్యలు కాని మగవాళ్లు ఎక్కడికి ట్రాన్స్ఫరయినా మూటాముల్లె కట్టుకుని వెళ్లటం లేదూ?

ఇంకా మన దేశంలో స్త్రీ విద్యనూ, స్త్రీల ఉద్యోగాలనూ సంఘం హృదయపూర్వకంగా హర్షించటంలేదు. కాని-చదువులూ ఉద్యోగాలూ తప్పనిసరి అయిపోయాయి.

నళినికి ఆ పల్లెటూరి నుంచి ట్రాన్స్ఫరు కాకపోతే చాలా ఇబ్బంది. ఏమిటో ఈ అధికారులు? పరిస్థితులను అర్థంచేసుకోరు. తల గోడకానించి కళ్లు మూసుకుని ఆలోచిస్తున్నాడు నారాయణ. తను ఉద్యోగమూ చేశాడు ఊళ్లూ తిరిగాడు. ఎక్కడికి పంపిస్తే అక్కడికి వెళ్లాడు. పిల్లల చదువులకు ఇబ్బంది అయితే రెండు కాపరాలూ పెట్టాడు. అయితే తనంటే మగాడు కనుక సరి పోయింది. కాని-ఆడపిల్ల-అందులోనూ వయసులో ఉన్న ఆడపిల్ల విషయం అట్లా కాదు కదా?

అంతలో ప్యూను వచ్చి "తొందరగా చీటీ లివ్వండి. ఎక్కువ టైములేదు. అమ్మగారు మళ్లీ కమిటీలో కూర్చుంటారు" అంటూ అందరికీ కాగితం ముక్క లిచ్చాడు పేర్లు వ్రాయమని.

ముందు నళిని ఇచ్చిన చీటీ తీసుకువెళ్లాడు. ఆఫీసు రూమ్‌లోనుంచి వస్తూనే "రమ్మంటున్నారు" అన్నాడు.

కొంగు సవరించుకుంటూ నళిని వెళ్లింది. ఖండువా సర్దుకుంటూ నారాయణ కూడా లోపలికి వెళ్లాడు.

ఆమె కెదురుగా ఉన్న కుర్చీలలో కూర్చోమని చేతి సైగచేసి నళిని అందించిన కవరు చేతిలోకి తీసుకుంది విద్యాశాఖాధికారిణి సరోజాక్షి.

దరఖాస్తు చదువుతూ ఒకటి రెండుసార్లు నారాయణను దీక్షగా చూసింది. దరఖాస్తు చదివి బల్లమీద పడేసి నళినివంక చూసింది.

"మేడమ్, నాకు ఆ ఊరినుంచి ట్రాన్స్ఫర్ చాలా అవసరం. మీరు నాకు సహాయం చెయ్యక తప్పదు" చేతులు జోడించింది నళిని.

ఆమె తరువాత నారాయణ అందుకున్నాడు. ముందు టొబేకో కంపెనీలో తన హోదా చెప్పాడు. నళిని తన పెద్దకూతురన్నాడు. తరువాత బదిలీ కావాలని అడిగాడు.

"బదిలీ ఎందుకు? ఇట్లా అందరూ అడిగితే పల్లెటూళ్లేమయిపోతాయి? అయినా ఉద్యోగానికి వచ్చినవాళ్లు ఎక్కడికి వేస్తే అక్కడికి వెళ్లాలి. ఇది మీ యిష్టమా? ప్రభుత్వం వారు ఎక్కడికి వేస్తే అక్కడికి వెళ్లితీరాలి" అన్నది అధికారిణి.

"అట్లాకాదులెండి. ఈ అమ్మాయిది ప్రత్యేకమయిన కేసు" అన్నాడు.

"అందరూ తమది ప్రత్యేకమనే అంటారు."

"అందరిలాంటిది కాదు ఈ కేసు. పిల్లకు పాతికేళ్లు లేవు. పెనిమిటి వదిలి పెట్టాడు. ఒక్కతే ఉండలేకపోతోంది. అందులో పెనిమిటి వదిలిపెట్టాడంటే మన సంఘం ఒకడేపు ఊపి చూస్తుంది ఆడపిల్లలను. ఈ అమ్మాయితో పంపాలంటే ఇంట్లో తల్లి తప్ప పెద్దవాళ్లు ఎవరూ లేరు. అందులో మరోచిక్కు వచ్చింది. అల్లుడు దీన్ని వదిలిపెట్టిన వాడు వదిలిపెట్టినట్టు ఊరుకోక ఇంకా ఇదేం చేస్తోందో? ఏం చదువుతుందో? ఎక్కడ ఉద్యోగం చేస్తున్నదోనని కనిపెట్టే ఉంటున్నాడు. ఏదయినా చిన్న పొరబాటు వచ్చిందంటే "అదిగో- అందుకే వద్దన్నాను" అంటాడు. మీరు ఎలాగయినా దయ ఉంచాలి. ఈ పిల్లను కనికరించాలి" అంటూ కళ్లద్దాలు తీసి తుడుచుకుని మళ్లీ పెట్టుకున్నాడు.

ఆయన కళ్లద్దాలు తీసినప్పుడూ మళ్లీ పెట్టుకున్నప్పుడు ఆయననే దీర్ఘంగా చూస్తోంది సరోజాక్షి.

ఆమెకు అంగుళం మేరకు పాపిటకు కుడివైపుగా ఒకపాయ నెరిసి తెల్లగా మెరుస్తున్నది. ఆమె కోలముఖానికీ పొడుగైన నాసికకూ విశాలమైన ఫాలభాగానికీ ఆ నెరిసిన పాయ ఒకవింత అందాన్నిస్తున్నది ఫాలభాగానికి మధ్యగా ఎర్రటి

కుంకుమబొట్టు ఎదటివారిని బెదరకొడుతున్నట్టుగా ఉంది. రికార్డు ప్రకారం ఆమె మరో ఐదేళ్లకు రిటైరవవలసి ఉంది. కాని- ఆమె ముఖం చూస్తే అలా అనిపించదు. మరో పదేళ్ల సర్వీసు ఉన్నట్టు కనబడుతుంది. ఆమెకు అధికారదర్పం ఉన్నట్టు కనబడదు కాని అధికారానికి తగిన హుందాతనం ముఖంలో కొట్టవచ్చినట్లు కనబడుతుంది.

మోచేతులు బల్లకానించి, చేతివేళ్లు కలుపుకుంటూ, కళ్లు దించుకుని, ఆలోచనలో పడినట్టుగా కూర్చుంది సరోజాక్షి.

నళిని ట్రాన్స్ఫర్‌ను గురించే ఆలోచిస్తోందనుకున్నాడు నారాయణ. ఆమె పెదవుల విప్పుకుని తనకే శుభవార్త చెబుతుందోనని ఊహించుకుంటున్నాడు.

నళిని కూడా అట్లాగే అనుకుంటోంది.

"మిస్టర్ మాచిరాజు నారాయణ...."

త్రుళ్లిపడ్డాడు నారాయణ- ఆమె సంబోధనకు.

ఆమెకు తన ఇంటిపేరు ఎట్లా తెలుసు ? బాగా తెలిసినట్టుగా సంబోధిస్తున్నదే ? అంతకాలం తను ఆ కంపెనీలో ఉద్యోగం చేశాడు. తన ఊరూ పేరూ విన్నదేమోననుకుని సర్దుకుని కూర్చున్నాడు.

"చూడండి అసలు ఆడపిల్లలకు చదువులెందుకు? ఉద్యోగాలెందుకు?కొట్టినా తిట్టినా ఆ మొగుడికే ఒప్పగిస్తే సరిపోతుందిగా ?" అన్నది కళ్లు పెద్దవి చేసుకుని.

అదిరిపోయాడు నారాయణ. ముక్కుపుటాలదిరిపోతున్నాయా మాటలకు కళ్లల్లో ఎర్రటి జీర.

"చూడండి కన్న తల్లి దండ్రులు చూస్తూ చూస్తూ కసాయి వాళ్లకు ఒప్ప చెప్పలేరు కదండీ ?" అన్నాడు కని కరిస్తుందనుకొని.

"ప్రతి ఆడపిల్లకూ తల్లిదండ్రులుంటారు. తల్లిదండ్రుల బాధ తల్లిదండ్రులదే కసాయివాళ్ల కరుకుదనం కసాయివాళ్లదే. భూమి గుండ్రంగా ఉంది" అంటూ బెల్ నొక్కింది.

దిగ్గున తండ్రీ కూతుళ్లిద్దరూ లేచారు.

"అయితే మేడమ్ నా కేసు కన్సిడర్ చేయరా?" చిన్నబోయిన ముఖంతో అడిగింది నళిని.

"ఇదివరకూ ఏమయినా ఆలోచించే దానినేమోగాని ఇప్పుడు వీలులేదు" పుల్ల విరిచినట్టు అన్నది సరోజాక్షి.

"వెనకటివి తలుచుకుని పిల్లలను బాధించటం అధికార లక్షణమా?" వెనక్కి తిరుగుతూ అన్నాడు నారాయణ.

"పిల్లలను బాధిస్తే తల్లిదండ్రులు ఎట్లా బాధపడతారో చూపించాలని" సరోజాక్షి అంటుండగానే మరో ఇద్దరు లోపలికి వచ్చారు.

చరచర నడుస్తూ ముఖాలు చిన్న బుచ్చుకుని ఆఫీసు దాటి బయటికి వచ్చారు. వాళ్లకు ఐదు గంటలకు ఊరికి వెళ్లే బస్సు ఉంది.

ఆమె అట్లా ఎందుకు మాట్లాడిందో తెలియక ఆలోచిస్తున్నది నళిని. సాధారణంగా ఆమె ఎప్పుడు ఎవరు వెళ్లినా ముందు ఇంటి సంగతులు అడుగుతుంది ఆప్యాయంగా.

"పెళ్లి అయిందా?" తరువాత ప్రశ్న.

"ఏం ఇంకా ఎందుకు చేసుకోలేదూ?" అంటుంది కాలేదని జవాబిస్తే సానుభూతి చూపిస్తూ.

"ఈ రోజుల్లో సంబంధాలు దొరకటమే కష్టంగా ఉంది. దొరికినా త్రాసు తూగటంలేదు. ప్రేమప్రేమ అంటారుగాని అది నిలిచి-పెళ్లి చేయించే ప్రేమకాదు. ఆడపిల్లలే కొంచెం జాగ్రత్తగా మసలుకోవాలి. సవాలు చేస్తూ-పందేలు కాస్తూ-విజృంభిస్తే ఆడపిల్ల జయించలేదు. ఎక్కడయినా మంచివాడిని వెదకి పెళ్లిచేసుకో. కలిసి మెలిసి బ్రతకటం కూడా ఒక కళ" అంటూ సంభాషణను సాగిస్తుంది.

ఏమిటీ ఇలా జరిగింది ఇవాళ?

తండ్రి వచ్చి కొంచెం గట్టిగా అన్ని విషయాలూ చెప్పి పని అయేటట్టు చేస్తాడేమోననుకుని బలవంతంగా తీసుకువెళ్లింది.

తల వంచుకుని నడుస్తూ తండ్రి ముఖంకేసి చూసింది. ఆ ముఖం పాలి పోయి ఉంది. చిన్నబోయి ఉంది. ఏదో ఆలోచిస్తూ ఉన్నట్టుగా మధ్య మధ్య కను బొమలు కలుసుకుంటున్నాయి. కళ్లు ఎరుపెక్కాయి. ముక్కు పుటాలు అదురు తున్నాయి.

అనవసరంగా నాన్నను తీసుకువచ్చి అవమానపరచినట్లయింది.

తెగ బాధపడి పోతున్నది నళిని.

బస్సు డిపోకు చేరుకున్నారు. పక్కనున్న కాంటీనులో కాఫీ టిఫిన్ తీసుకున్నారు. బస్సు రావటానికి ఇంకా గంటన్నర పైముంది.

ఇద్దరూ సిమెంటు బెంచీమీద కూర్చున్నారు.

"నాన్నా. ఎండలో నిన్ను అనవసరంగా తిప్పాను. ఏమయినా బాధగా ఉందా?" నొచ్చుకున్నట్టుగా అడిగింది నళిని.

"ఏం లేదమ్మా- ఏం లేదు. ఈమాత్రం తిరుగుడు లేదేమిటి నాకు? అయినా ఇదెంత దూరమని అట్లా అడుగుతున్నావు?" మనసులో చెలరేగుతున్న భావాలను పైకి పొంగనివ్వకుండా జాగ్రత్త పడుతూ ముఖం మామూలుగా పెట్టటానికి ప్రయ త్నించాడు.

"ఆమె మీకు ఇదివరకే తెలుసా నాన్నా? ఇంటి పేరుతోసహా సంబోధిం చింది?" ప్రశ్నార్థకంగా చూసింది ఆయన ముఖంలోకి.

"అబ్బే. ఎప్పుడూ చూసిన ముఖంకాదు. అయితే మనపని కాకపోయిందా?" కంగారును అణుచుకుంటూ అన్నాడు.

"ఎప్పుడూ చూడకపోయినా చాలా మర్యాదగా మాట్లాడుతుంది. కష్టసుఖాలు అడిగి తెలుసుకుంటుంది. సాధారణంగా అడిగింది కాదనదు. ఏమిటో ఇవాళ ఇలా జరిగింది. ఆమె స్వభావానికి విరుద్ధంగా ప్రవర్తించింది."

"ఆమెకు ఇల్లూ సంసారం ఉందా?" చాలా నెమ్మదిగా అడిగాడు.

"ఇల్లా?" నవ్వింది నళిని. "ఇల్లు లేకపోవటమేమిటి నాన్నా? ఇల్లు లేక పోతే ఎక్కడుంటోంది? సంసారమంటావా? ఆ సంగతి నాకు తెలియదు."

“అది కాదమ్మా. సంసారమంటే మొగుడూ పిల్లలూ నన్నమాట” ఆ మాట అంటుంటే ఆయన మనసు చివుక్కుమన్నది. నళినికి సంసారము అంటూ ఏర్పడక ముందే అల్లుడు పేరున ఇంట్లో అడుగుపెట్టిన దశమగ్రహానికి అదివరకే భార్యా పిల్లలున్నారని తెలిసింది ఈ కట్నం డబ్బు తీసుకువెళ్లి డాబామీద రెండుగదులు వేసి అద్దెకిచ్చాడు. ఆ అద్దెతో పిల్లవాడికి చదువు చెప్పిస్తున్నాడు. తనకాతడి పద్ధతులు నచ్చక, కూతుర్ని పంపనని చెప్పి ఆమెను పట్టభద్రను చేసి, తన పరపతితో ఉద్యోగ మిప్పించాడు. నళిని ప్రథమ సంతానము. తమకిద్దరికీ ఎంతో ప్రాణప్రదమైనది. ఆమెకు ఏ లోపము వచ్చినా గుండె బీటువారినట్లనిపిస్తుంది.

బస్సు వచ్చింది. ప్రయాణీకుల సందడి దిగేవాళ్లకు దిగాలని తొందర. ఎక్కేవాళ్లకు ఎక్కాలని తొందర. సందు చేసుకుని ఇద్దరూ ఎక్కారు.

ఇంట్లో అడుగుపెడుతూనే అన్నపూర్ణమ్మ వేసిన ప్రశ్నను ఎదుర్కోవాల్సి వచ్చింది.

“ఏమయింది? ట్రాన్స్ఫరు చేస్తానందా?”

ఆయన గబగబా తన గదిలోకి వెళ్లి ఖండువా చెప్పులు వదలి ముఖం కడుక్కోటానికి బాత్‌రూములోకి వెళ్లాడు. నళిని ముఖమ్మీద కనబడిన నైరాశ్యాన్ని చూసి హతాశురాలయింది అన్నపూర్ణమ్మ.

“కాకపోతే పోనీలే. సెలవు పెట్టు. ఇక్కడే పదిమందికి చదువు చెబితే ఆ జీతమంత డబ్బు రాదా? లేకపోతే తక్కువ జీతానికయినా సరే. ఈ ఊళ్లో ప్రైవేటు స్కూళ్లో దొరక్కపోతుందా? ఏమిటో మీనాన్న ఆశలన్నీ అందలమ్మీద ఉంటాయి. నేను వద్దనే అంటున్నా- విన్నారు కాదు.”

నారాయణకు చూడగానే “వంటయింది. భోజనానికి లేవండి. అమ్మాయి అలిసిపోయినట్టుంది. వేడివేడిగా తిని పడుకుంటుంది. ఇవన్నీ ఎప్పుడూ ఉండేలే” ఆమె భోజనాలు అమర్చటానికి వెళ్లింది.

పది గంటలు దాటింది. ఇంట్లో అందరూ నిద్ర కొరిగారు. కాని-నారాయణ మనసు ప్రశాంతంగాలేదు. ఏమిటో ఆలోచనలు: ఎక్కడెక్కడో పరిభ్రమిస్తున్నాయి:

ఆమె పేరు కమల కదా. సరోజాక్షి ఎట్లా అయింది? పేరంటే మార్చుకో

వచ్చుగాని పోలికలు ఎట్లా మార్తాయి? అసలు తను గుర్తుపట్టకనేపోను. కాని ఆమె ఆడిన మాటలు పట్టిచ్చాయి.

ఆయన మనోవీధిలో ఒక వేదిక ఏర్పడింది. ఆ వేదిక మీద పదహారేళ్ల కమల పైటకొంగును భుజాలమీదుగా ముందుకులాక్కొని తలవంచుకుని నిలబడ్డది. ఆమె తండ్రి హరిగోపాలం చేతులు నలుపుకుంటూ కోటయ్యను ప్రాధేయపడు తున్నాడు.

"ఈ రెండు నెలలూ ఉండనీయండి. పరీక్ష వ్రాసిన మరునాడే మీ యింటికి వస్తుంది" అంటున్నాడు.

"పరీక్ష ఎవడికి కావాలయ్యా? ఆమెగారు చదివి ఊళ్లేలా? ఉద్యోగాలు చేయాలా? మీరు పంపదలచుకుంటే మాతో పంపండి. లేకపోతే ఇంతే" ఘాటు. డుగా మాట్లాడాడు కోటయ్య.

"రెండే నెలలండీ చాలా కష్టపడి చదివింది. దానికి గోల్డ్ స్కాలర్ షిప్పు వస్తుందని అనుకుంటున్నారు స్కూల్లో. పై చదువులు లేకపోయినా ఈ పరీక్షయినా కానీయండి. ఇంటికి పెద్దబిడ్డ. దానికి కన్నీళ్లు వస్తే మా ప్రాణాలు అవిసిపోతాయి." ఇంకా దీనంగా ముఖంపెట్టి ప్రాధేయపడుతున్నాడు హరిగోపాలం

"అవన్నీ కుదరవండి రారా నారాయణా" ముందుకు నడిచాడు కోటయ్య.

హరిగోపాలం ఆయనను పోనిచ్చి నారాయణ చేతులు పట్టుకుని "బాబూ, అమ్మాయి దుఃఖపడుతుంది. ఈ రెండు నెలలు ఇక్కడే ఉంచు నాయనా. పరీక్ష లయిన మరునాడే పంపిస్తా. ఇవి చేతులు కావు-కాళ్లనుకో" బ్రతిమిలాడాడు.

కమల ముఖమెత్తి నారాయణ ఏమంటాడోనని ఉత్కంఠతో చూసింది. ఇద్దరి కళ్లు కలుసుకున్నాయి. కమల కళ్లతో అభ్యర్థన

నారాయణ కనుబొమలు ముడిచి చప్పున తండ్రి వెళ్లిన వైపు కళ్లు తిప్పు కున్నాడు.

"మా నాన్న మాటే నా మాట. పంపితే ఇప్పుడే మా వెంట పంపండి. లేకపోతే-ఇంతే సంగతులు" చేతులు విడిపించుకొని తండ్రిని అనుసరించాడు.

హరిగోపాలం కమల స్థాణువులై పోయాడు.

కొంతసేపటికి కమల తేరుకుని "వద్దంటుంటే కాళ్ళమీద పడటానికి మనకేం. కర్మ నాన్నా? వెళ్లనీ విశ్రాంతగా పరీక్ష వ్రాస్తా. నాకు గోల్డ్ స్కాలర్‌షిప్పు ఖాయం" తండ్రి చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకు వెళ్లింది. ఆమె అప్పుడే. నిశ్చయించుకుంది తను పై చదువులు చదవాలనీ-ఉద్యోగం చెయ్యాలనీను.

మరుసటి నెలలోనే నారాయణ పక్కన అన్నపూర్ణ వధువుగా కూర్చుంది. వివాహ వేదిక మీద.

అంతే.

ఆ తరువాత వారేమయినారో వీరు వాకబు చెయ్యలేదు. వీరేమయినారో వారు కనుక్కోదలచలేదు.

ఋతుచక్రం విధీ విరామం లేకుండా తిరుగుతునే ఉంది.

నారాయణ కళ్ల ముందర నిలిచిన వేదిక క్రమంగా అంతరించిపోయింది

"ఆఁ ఇదన్నమాట అసలు సంగతి ఆడదయితేనేం? చదువుకుంది. ఉద్యోగిని అయింది. అప్పటి మాటకు ఇప్పుడు జవాబు చెప్పింది ముఖమ్మీద."

ఆడది?? తననెంత లోకువ చేసి మాట్లాడింది?

"ఛీఛీ. అనుభవంలోకి వచ్చినా నీకింకా అహం తగ్గలేదు. ఆమె తండ్రి స్థానంలో ఈనాడు నీ వున్నావు. ఆమె స్థానంలో ఈనాడు నీ కూతురుంది. ఆడది ఆడది అంటూ చులకనగా మాట్లాడకు. నీవు ప్రాణప్రదంగా చూచుకునే నీ కూతురు కూడా ఆడదే" బుద్ధి వీపుమీద అయిదు వేళ్లతో చరచింది వేళ్లు అంటేటట్టుగా.

తల విదిలించుకుంటూ మంచమ్మీద లేచి కూర్చున్నాడు నారాయణ. నగ్న సత్యాన్నీ నిత్యసత్యాన్నీ ఒప్పుకోవటానికి మనసు మొరాయించటం మొదలు పెట్టింది.

పక్కమీద దొర్లిదొర్లి తెల్లవారు జామున ఏనాలుగంటికో అతడు నిద్రలోకి జారుకున్నాడు

మూడోనాడు మధ్యాహ్నం నళినికి ఆమె కోరిన చోటికి బదిలీ చేస్తున్నట్టుగా ఆర్డర్సు వచ్చాయి.

"నాన్నా. నేను చెప్పలేదూ? ఆమె చాలా మంచిది. మనం వెళ్లినప్పుడు ఏదో చికాకులో ఉన్నట్టుంది" నళిని చాలా సంతోషించి తల్లికివార్త పరుగున వెళ్లి చెప్పింది.

నారాయణ విర్లిప్తుడుగా పెదవులు ముడిచి సాగదీసుకున్నాడు.

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక)